## క్లుప్తంగా

### తొలి ఏకాదశి, బక్రీదు శుభాకాంక్షలు

నూజెండ్ల: తొలి ఏకాదశి, బక్రీదు పర్వదినాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, హిందూ, ముస్లిం సోదరులకు భగవంతుని ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు.

### సొసైటీ ఇన్‌చార్జిగా చైర్మన్‌గా కానాల పున్నారెడ్డి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం గుర్వానాయుడుపాలెం సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా పాత చెరుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన కానాల పున్నారెడ్డి నియమితులయ్యారు. చైర్మన్‌గా ఉన్న పారా వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఇన్‌చార్జి చైర్మన్‌గా పున్నారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పున్నారెడ్డిని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించారు.

### రేపు ఏఎంజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

చిలకలూరిపేట: స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఏఎంజీ ఐటీఐ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మణిదీపక్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు అశోక్ లేలాండ్, మారుతి సుజికి, వసంత స్పిన్నర్స్, తిరుమల కాటన్, ఎస్ఎస్ఎల్ కాటన్, జోషిల్, షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీల ప్రతినిధులు హాజరౌతారని తెలిపారు. ఐటీఐలో అన్ని ట్రేడ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### అపోహలు నమ్మకండి

శావల్యాపురం: అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి అమ్మఒడి పథకం వర్తించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ఇర్లపాడు గ్రామంలో అర్హత కలిగి ఉన్న విద్యార్థులకు అమ్మఒడి పథకానికి సంబంధించి ఈకేవైసీ నమోదు చేయలేదని కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు. ఈవిషయం తమ దృష్టికి రాగా సత్వరమే సంబంధిత గ్రామసచివాలయ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో అర్హులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

### సాతులూరులో ఇరువర్గాల ఘర్షణ

నాదెండ్ల(యడ్లపాడు): గేదెల రాకపోకల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఎ.భాస్కర్ కథనం ప్రకారం.. సాతులూరు ఎస్సీ కాలనీలో మంగళవారం ఉదయం కోట పూర్ణేమస్తాన్ తన గేదెలను పొలానికి తోలుకెళ్లేందుకు రైలుకట్ట వద్దకు వెళ్లాడు. అక్కడ రహదారి పనుల నిర్మాణం పనులు జరుగుతుండటంతో రాకపోకల్ని నిలిపివేశారు. దీంతో పక్కనే ఉన్న కాలనీలోని మరోరోడ్డు మీదుగా గేదెలను తోలుకెళ్లే క్రమంలో కోట దాసురాజేష్ గేదెల్ని వెళ్లనీయకుండా రాళ్లు, కర్రల్ని అడ్డుగా పెట్టాడు. ఇది పంచాయతీ అధికారులు వేసిన రోడ్డు అని వెళ్లొద్దనడానికి మీరెవరంటూ వాదన మొదలై ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కారం, కర్రలు విసురుకున్నారు.

సమాచారం తెలుసుకున్న గ్రామపెద్దలు నడింపల్లి వెంకటేశ్వరరావు, సురేష్ తగాదాను వారించేందుకు వెళ్లగా వారిపై కూడా రాళ్లు రువ్వారు. వీరికి గాయాలు కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

# పేదలందరికీ రక్ష జగనన్న సురక్ష

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సంకురాత్రిపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంత్రి పర్యటన
- మూడోరోజు కొనసాగిన గడప గడపకు కార్యక్రమం


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల (యడ్లపాడు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలందరికీ రక్ష అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. బుధవారం రాత్రి ఇదే గ్రామంలో మూడోరోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో ప్రతి ఇంటికి చేకూరిన సంక్షేమ పథకాల వివరాలను తెలిపే కరపత్రాలను కుటుంబ సభ్యులకు అందిస్తూ.. వారిని చిరునవ్వుతో పలకరిస్తూ.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకుంటూ కార్యక్రమాన్ని ముందుకు కొనసాగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే గడపగడపకూ కార్యక్రమంలో ఎదురైన సమస్యలకు ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారం చూపుతున్నామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టేందుకే జగనన్న సురక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్పష్టం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జనన, మరణ, వివాహ, కుల, ఆదాయం వంటి వివిధ రకాలైన 11 సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వివరించారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి సేవలు ఎక్కడా అందించలేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆయా సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రజిని కోరారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పారదర్శక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోమారు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, ఉపసర్పంచ్ గంటా వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ పత్తి సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుగుంట్ల వెంకటరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు తప్పెట క్రీస్తురాజు, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, జెట్టి బొల్లయ్య, శివలక్ష్మీనారాయణ, వీరాస్వామి, ఇక్కుర్తి శ్రీనివాసరావు, పత్తి వెంకట్, సిరికొండ హరి, ఆరేటి పాపారావు, టీజే రత్తయ్య, అల్లడి రవికుమార్, బ్రహ్మయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్‌పాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- కొబ్బరికాయ కొట్టి పనులు ఆరంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- గడపగడపలో వచ్చిన సమస్యలకు పరిష్కారం


అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: స్థానిక ఐదో వార్డులోని క్రిస్టియన్ పాలెంలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం సాయంత్రం క్రిస్టియన్ పాలెంలో డ్రైన్లు, కల్వర్టులు, సీసీరోడ్ల నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించే ప్రక్రియలో ఈ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటిని రెండు నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గతంలో నాడు–నేడు కింద స్కూలును అభివృద్ధి చేశామన్నారు. శివ సంజీవయ్య కాలనీలో ఫుట్‌పాత్ బ్రిడ్జి ఏర్పాటు చేశామన్నారు. మొదటి నుంచి వైఎస్సార్‌సీపీకి ఈ ప్రాంతం కంచుకోటగా ఉందని, గత ఎన్నికల్లో 1300 ఓట్ల మెజార్టీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వర రావు, జిల్లా ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జి.అచ్యుతరావు, గోపిరెడ్డి యువసేన అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, కుక్కల పోలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే అవగాహన ఏర్పరచుకోండి

విద్యార్థులకు కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచన


క్విజ్ పోటీలను పరిశీలించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట రూరల్: విద్యార్థి దశ నుంచి ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగం నేతృత్వంలో నిర్వహించిన అఖిల భారత స్కూల్ క్విజ్–23 పోటీలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈనెల 21వ తేదీన మండలస్థాయిలో నిర్వహించిన పోటీలలో 28 మండలాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి జిల్లాస్థాయిలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఆర్థిక అంశాలపై పట్టుంటే క్విజ్ పోటీలలో పాటు జీవితంలో కూడా విజయం సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్విజ్ పోటీలలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్, ఎల్డీఎం వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రదానోపాధ్యాయినీ పార్వతీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటికి చర్యలు

- పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల బృందం సర్వేకు శ్రీకారం
- మంత్రి విడదల రజిని కృషితో రూ. 37.10 కోట్ల నిధులు
- గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామాల్లో పనులు


గణపవరంలో సర్వేకు వచ్చిన ఇంజినీర్ల బృందం

నాదెండ్ల (యడ్లపాడు): మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో బుధవారం పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల బృందం సర్వేను ప్రారంభించారు. చిలకలూరిపేట విలీన గ్రామాలైన గణపవరం, పసుమర్రు, మానుకొండ వారిపాలెంలో అమృత్ 2.0, ఎస్‌డబ్ల్యూఏపీ సంయుక్త పథకాల ఆధ్వర్యంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు సర్వే బృందాలు తెలిపాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవతో ఆయా పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. రూ.37.10 కోట్ల నిధులను వచ్చేలా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక సంస్థల భాగస్వామ్యంతో 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వినియోగించనున్నారు. ఆయా నిధులతో ఈ మూడు గ్రామాల్లో చెరువుల అభివృద్ధి, పైపులైన్ల నిర్వహణ, ఆధునిక శుద్ధియంత్రాలు, శుద్ధి చేయగా వచ్చిన వృధానీటిని ఫిల్టరైజేషన్ చేసి కుప్పగంజి వాగులో అనుసంధానించే ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సర్వే బృందాలను మున్సిపల్ వైఎస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఏ శేఖర్, కౌన్సిలర్లతో కలిసి అమృత్ 2.0 పై చర్చించారు. అనంతరం వైస్‌చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మున్సిపాలిటీకి ధీటుగా విలీన గ్రామాల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చేయనున్నట్లు చెప్పారు. సర్వే బృందంలో పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు ఎస్.నాగబ్రహ్మాచారి, ఐబీ కృష్ణారావు, గుంటూరు ఎస్ఆర్ కన్సల్‌టెన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం సూర్యతేజ, వారితో పాటు సచివాలయం ఇంజినీర్లు అసిస్టెంట్లు బాష, ఉమాదేవి, ఉమామహేశ్వరరావు, శిల్ప ఉన్నారు.

## బడి మనదే.. బాధ్యతా మనదే!

- ఎంఈవో–2 అరుణకుమారి
- యడ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

యడ్లపాడు: బడి మనదే... బాధ్యత మనదే అన్న భావన గురువులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లోనే ఏర్పడినప్పుడు విద్యాలయాలు మంచిగా వర్ధిల్లుతాయని యడ్లపాడు ఎంఈవో–2 ఎన్.అరుణకుమారి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని వివిధ తరగతులకు వెళ్లి బోధన తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలు, మెనూ నిర్వహణను అడిగి తెలుకున్నారు. విద్యార్థులు భుజించే భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఎంఈవో–2 అరుణకుమారి మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద విద్యార్థులకు మంచి పౌష్టికాహారమని, ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఎంతో వ్యయంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఏజెన్సీ కూడా ఆహార పదార్థాల తయారీ సమయంలో రుచి, శుచి రెండింటికీ ప్రాధాన్యత ఇస్తూ మెనూ ప్రకారంగానే వంటలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లలు ఇళ్ల నుంచి క్యారెజీలను తీసుకురాకుండా ఇక్కడే భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.విజయభారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఒకటి నుంచి టేక్‌హోం రేషన్ విధానం

నాదెండ్ల(యడ్లపాడు): జులై ఒకటో తేదీ నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు పౌష్టికాహారం కిట్లను టీహెచ్ఆర్ (టేక్ హోం రేషన్) విధానంలో పంపిణీ చేయాలని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీవో జి.శాంతకుమారి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయి సమావేశం బుధవారం జరిగింది. నియోజకవర్గంలోని చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల అభీష్టం నెరవేర్చే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని.. ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

యడ్లపాడు: జగనన్న అమ్మఒడి పథకం ద్వారా వరుసగా నాల్గో ఏడాది తల్లుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ కావడం పట్ల మండలం బోయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి హైవే సెంటర్ వద్ద క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సంక్షేమ ప్రదాత నిండు నూరేళ్ల జీవించాలని పెద్దలు, జగన్‌మామయ్య తోడుంటే తమ భవిష్యత్‌కు చింతేలేదంటూ చిన్నారుల అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ నాయకులు షేక్ హుస్సేన్, వి.శ్రీనివాస నాయక్, షేక్ మోధిన్‌బాష, ఆర్.శివానాయక్, వి.శేఖర్‌నాయక్, షేక్ చిన్నమస్తాన్, పెద రాజులు, ముస్తఫా, మద్రిపాలెం పార్టీ నాయకులు వలేటి ఉదయ్ కిరణ్, షేక్ జాను, బోడ సురేంద్ర పాల్గొన్నారు.

### బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

చిలకలూరిపేట: బక్రీద్ ప్రార్థనలకు అడ్డరోడ్డు సెంటర్‌లోని ఈద్గా మైదానం సిద్ధమైంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి శుభ్రపరిచారు. పనులను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సీహెచ్ గోవిందరావు పర్యవేక్షించారు. గురువారం ఉదయం 7 గంటలకు బక్రీద్ సందేశాన్ని ముఫ్తీ ఖలీల్‌ఖాన్ ఇస్తారని, 8 గంటలకు నమాజును ముఫ్తీ అనస్‌ఖాన్ నిర్వహింప చేస్తారని అంజుమన్ ఇస్లామియా కార్యదర్శి షేక్ అహ్మద్ తెలిపారు. అడ్డరోడ్డు సెంటర్‌లో ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనలను పురస్కరించుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లను పట్టణ పోలీసులు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి బక్రీదు ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్‌ను వేరే మార్గాలకు మళ్లిస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

### జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

యడ్లపాడు: అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ ఫలాల్ని వందశాతం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీవో వై హనుమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యల్ని గుర్తించే ప్రక్రియను వేగంగా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలు తమకు అర్హత ఉండి ఏదైనా సంక్షేమ పథకం రానివారు వలంటీర్ల దృష్టికి తేవాలన్నారు. ఆయా సంక్షేమ పథకాలను పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీటికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

### పుస్తకాలు పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్ శ్రీ సాయి క్షేత్రంకు చెందిన సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కసపర్రు గ్రామం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పలకలు, బాక్స్‌లు అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు మురారిశెట్టి గోపాలబాబు, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మీ, రాఘవయ్య, శైలజ, పేరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు గోపాలబాబు తెలిపారు.

### ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం హరిజనవాడ కాలనీ నందు దాతల సహకారంతో ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బొల్లాపల్లి మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజరు సంద్రపాటి చలపతిరావు వెల్లడించారు. బుధవారం ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. 70 మంది విద్యార్థులకు టీకా వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.పరమేశ్వరరావు, గన్నవరపు శ్రీనివాసరావు, రవిచంద్ర, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాసరావు, కాలనీలో యువకులు పాల్గొన్నారు.

### హత్య కేసులో నిందితుడి అరెస్టు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో ఈనెల 13న అర్ధరాత్రి వ్యక్తిపై దాడి చేసి హతమార్చిన కేసులో నిందితుడు తలమాల వెంకన్నను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన విప్పర్ల వెంకట్రావు (40) గ్రానైట్ కంపెనీలో పనిచేస్తుంటాడు. 20 ఏళ్ల క్రితం నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన జయమ్మతో వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. పిల్లల చదువు నిమిత్తం కుటుంబం తరలివచ్చి ఐదేళ్లుగా నివాసం ఉంటూ ఇక్కడి నుంచే గ్రానైట్ కంపెనీకి పనికి వెళ్తుంటాడు. అదే కాలనీకి చెందిన ఓ మహిళతో వెంకట్రావుకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో సదరు మహిళ భర్త తలమాల వెంకన్న 13న ఆరుబయట నిద్రిస్తున్న వెంకట్రావుపై రాడ్డుతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలపాలైన వెంకట్రావును కుటుంబ సభ్యులు, స్థానికులు నరసరావుపేటకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తలమాల వెంకన్నను అరెస్టు చేసి చిలకలూరిపేట కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో మరో ఇరువురు అనుమానితులను అరెస్టు చేయాల్సి ఉంది.

### నాబార్డు అండగా ఉంటుంది

శావల్యాపురం: నాబార్డు రైతులు నిరంతరం అండగా ఉండటంతో పాటు వారి ఆర్థిక ప్రగతి కోసం కృషి చేస్తుందని నాబార్డు డీడీయం (మూడు జిల్లాల అధికారి) జి.శరత్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజను ప్రారంభమైన నేపథ్యంలో నాబార్డు రూ. 389 కోట్లు రీఫైనన్స్ నిమిత్తం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులకు మొదట విడతలో మంజూరు చేసినట్లు చెప్పారు. పల్నాడు జిల్లాలో శావల్యాపుర బ్రాంచ్ శాఖ రూ. 180 కోట్లు ఆర్థిక లావాదేవీలు కొనసాగించటంతో పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. ఆర్‌బీఐ, నాబార్డు నిబంధనలు ఖాతాదారుల సేవలు రుణాలు రీకవరీ, బ్యాంకు అధికారుల పనితీరు పరిశీలించామన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. నరసరావుపేట రీజనల్ బ్రాంచ్ మేనేజరు చిరుమామిళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రీజనల్ పరిధిలో 65 బ్రాంచ్‌లు ఉండగా రూ. 1900 కోట్లు డిపాజిట్స్ రూ. 3900 కోట్లు రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆయనతో పాటు బ్రాంచ్ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్, రీకవరి అధికారి వెంకటరెడ్డి, సహాయ మేనేజరు గుబ్బల సుధీర్, బ్యాంకు అధికారులు ప్రదీప్‌కుమార్, హరణి, నివ్య, మహేష్, సిబ్బంది రామిరెడ్డి పాల్గొన్నారు.